మూర్తి; మధ్యలో సీతాలక్ష్మణ సహితుడైన కోదండరాముడు. ఆ రాముని పాదసన్నిధిలో మోకరించి కూర్చున్నట్టున్న హనుమద్విగ్రహం. ఇవిగాక మహత్తర పౌరాణిక సంఘటనలను జ్ఞప్తికి తెస్తూ గంగావతరణం, గోవర్ధనోద్ధరణా, శివధనుర్భంగం, గీతా ప్రబోధం లాంటి పటాలు గోడలకు వ్రేలాడుతున్నాయి.

కానీ నా చూపు లెంతోసేపు ఆ దేవతామూర్తులపైన నిలిచివుండలేదు. గదిలో ఒక గోడను పూర్తిగా దృక్పథం నుంచి తప్పించివేస్తూ నిలుచున్న బీరువాల్లో అందంగా అట్టలు తొడుక్కుని, ముచ్చటగా నామాక్షరాలు లిఖింపబడి, యితిహాసాలనుండి శతకాల వరకూ విస్తరించివున్న పుస్తకాల ప్రపంచం—అదొక సరస్వతీ సామ్రాజ్యంలా కనిపిస్తోంది.

నరసప్పగారు దీపాలు వెలిగించారు. అగరువత్తులు ముట్టించారు. ఒకటిరెండు నిమిషాలపాటు అర్ధనిమీలిత నేత్రాలతో నిశ్చలంగా వుండిపోయి, తర్వాత హఠాత్తుగా తల పైకెత్తి నా వైపు చూచారు.

ఆ చూచిన చూపుల్లో ఏదో చెప్ప దలచుకున్నా రన్న యింగితం స్ఫురించింది.

'ఏమిటండీ మేష్టరుగారూ!' అన బోయాను. కానీ అనలేదు.

"జీవితంలో ఏ సమస్యకైతే పరిష్కారాన్ని ఊహించలేకపోయానో, దానికీనాడు పరిష్కారం కుదిరింది."

అర్థం కావడంలేదు.

"చూస్తున్నావుగా! నా వయ సుడిగిపోయింది. నన్ను నమ్ముకున్నవాళ్ళకందరికీ నేను వేరొక ఆశ్రయాన్ని చూపించవలసిన సమయం సమాసన్నమైంది. ముదిమిలో తల్లిదండ్రులకు బిడ్డలే దిక్కు. నాకా బిడ్డలు లేరు. మా ఆవిడకు పొలాల్ని చూపించి వెళ్తున్నాను. ఆ పొలాలకు నరసింహాల్ని చూపించి వెళ్తున్నాను. ఎటొచ్చీ ఈ పుస్తకాల విషయమే నా కొక సమస్యగా వుండిపోయింది."

అర్థంగాక అయోమయంగానే ఆయన వంక చూస్తున్నాను.

"నా దొక అజ్ఞాత ప్రపంచం. నా చిరునామా అయినా నీకు తెలియదు. భగవంతు డిలా నిన్నిక్కడికి లాక్కొచ్చాడంటే యిది నిష్కారణంగా జరిగి వుంటుం దనుకోను."

దగ్గరగా వచ్చి నా చేతులు రెండింటినీ తన చేతుల్లోకి తీసుకుంటూ అన్నారు—

"వీటిని నీ కప్పగిస్తున్నాను. నా పుస్తకాలను ప్రాణప్రదంగా చూచుకుంటావా రాజూ?"

నరసప్పగారి కంఠం గాద్గదికం అయిపోయింది.

---

# ఉద్యోగమా— సంసారమా!



కుమారి నంద

ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లోని వాంటెడ్ కాలమ్స్ అన్నీ తిరగేసింది నిర్మల. టీచర్సు కావాలని వేసిన ప్రకటనను చదివి బి. ఎ. బి. ఇడి. టీచరుపోస్టుకు అప్లయి చేసింది. ఎందుకైనా మంచిదని ఈ విషయం భర్తకు చెప్పలేదు. పదిరోజులు గడిచిన తర్వాత జాయినవమని ఆర్డర్సు వచ్చాయి. ఆ సాయంత్రం ఆఫీసునుండి

భర్త ఇంటికి రాగానే ఈ వార్త మెల్లిగా చెవిన పడేసింది.

అందుకు శంకర్రావు – "మనకు డబ్బుకు లోటులేదు. నే సంపాయించేది చాలకనా నీవుకూడ ఉద్యోగం చేయటం? మనకున్న ఆస్తిని వెనకాల అనుభవించే వాళ్లుకూడ లేరు. అనవసరమైన శ్రమతో నీవు ఉద్యోగం చేయటం దేనికి? వద్దు నిర్మలా!" అని అన్నాడు.

"డబ్బును గురించి కాదండీ! ఇంట్లో వుంటే నా కేమీ తోచడంలేదు. మీరేమో ప్రొద్దుననగా వెళ్ళి సాయంత్రం వస్తారు. మధ్యాహ్నం భోజనానికొచ్చినా ఎక్కువ సేపు వుండరు. డబుల్ గ్రాడ్యుయేట్ నయివుండి కూడా ఇంట్లో ఖాళీగా కూర్చోడం నాకేం బాగోలేదు. నా సరదా తీరటానికైనా ఉద్యోగం చేయనివ్వరా?" అంది ప్రాధేయపడుతూ.

భార్య జాలిగా అడిగే కోరికను త్రోసి పుచ్చలేక ఒప్పుకున్నాడు, భర్త శంకర్రావు!

రోజూ ప్రొద్దున్నే లేచి వంటచేసి పదిగంటలకు బడికి వెళ్ళేది నిర్మల. పదిహేను రోజు లయ్యేసరికి వంటకూ, బడికీ కుదరకపోవడం చూచి శంకర్రావు భార్యతో "ఉద్యోగం మానేయకూడదూ? పనితో చాల అవస్థ పడుతున్నావు."

"ఆ! ఫర్వాలేదు," అంది నిర్మల.

"నీ కెందు కింత శ్రమ," అన్నాడు గోముగా.



కాసేపాలోచించి–"పోనీ ఒక వంట మనిషిని చూడండి. పెట్టుకుందాం," అంది నిర్మల.

"నాకు తేలీదు ఈ ఆడవాళ్ళను గురించి నీవే ఎక్కడైనా చూడు నిర్మలా!" అన్నాడు భర్త.

ఈ సంగతి నిర్మల ప్రక్కింటి తులశమ్మగారితో చెప్పింది. వారంరోజుల కల్లా ఆమె ఒక వంటమనిషిని కుదిర్చింది. పేరు పారిజాతం. అందగత్తె కాకపోయినా ఆకర్షణమైనదని చెప్పవచ్చు – రోజూ వచ్చి వంటచేసి వెళ్తుండేది. ఏరోజు కారోజు మరునాడు చెప్పాల్సిన పాఠాలను ఇంటిదగ్గర ప్రిపేరయి వెళ్తుండేది నిర్మల. నెలపరీక్షలు దగ్గరకొచ్చాయి విద్యార్థినులకు. పరీక్ష పేపరు తయారుచేసి పిల్లలకు పరీక్షలు పెట్టింది నిర్మల. పిల్లలచే వ్రాయబడిన పరీక్షపుస్తకాలు తీసికొచ్చి దిద్దటం ప్రారంభించింది.

"ఇంకా ఎంత సేపు నిర్మలా పుస్తకాలు దిద్దటం?" అన్నాడు భర్త భోజనం చేస్తూ.

"అయిపోవచ్చిందండీ," అని సమాధాన మిచ్చింది.

భోజనం చేసివచ్చి, నిర్మలకొరకు ఎదురుచూస్తూ అలాగే నిద్రపోయాడు.

నిర్మల పుస్తకాలన్నీ దిద్ది, లైటార్పి పడుకోటాని కొచ్చేసరికి భర్త గాఢ






నిద్రలో వుండడం గమనించి, తానుకూడ పడుకుంది.

మరునటిరోజు రాత్రి పరీక్షమార్కులన్నీ వేసి లిస్టు తయారుచేసింది. తర్వాత ప్రోగ్రెస్‌షీట్స్ తయారుచేసి సబ్‌మిట్ చేసింది. ఇలాగే ఏరోజు కారోజు ఆశా భంగం పొందుతున్నాడు శంకర్రావు. ఒకరోజు నిర్మలకు లాస్ట్ పీరియడు విశ్రాంతి అవటంవలన తలనొప్పి భరించలేక హెడ్‌మిస్ట్రెస్‌ను పర్మిషన్

అడిగివే ఇంటికి వచ్చింది. తలుపు మెల్లిగా తీసుకొని లోపలికి వెళ్ళబో యేసరికి వంటింట్లోనుండి మాటలు వినపడ సాగినయ్. భర్త ఆరోజు ఆఫీసుకు శలవు పెట్టాడని గుర్తుకువచ్చి చప్పుడు చేయ కుండా ఆమాటలు వినసాగింది.

"పారూ! ఇంకా ఎంతసేపు ఈ వంటింట్లో జపం చేయడం? సరదాగా కాసేపు కబుర్లు చెప్పు;" ఒకకంఠం. అది తన భర్తగొంతేనని గుర్తించింది, నిర్మల.

"కాఫీ పెట్టనివ్వండి."

పారిజాతం ఎంతమోసం చేస్తోంది అనుకుంది నిర్మల.

"కాఫీసంగతి తర్వాత చూచుకో వచ్చులే. ఎప్పుడూ వంటిల్లు వదిలి బైటకు రావు. నా హృదయంలో నీకు స్థానమిచ్చి నప్పుడు నీవు ఇంకా ఎందుకు సందే హించడం; ఇలారా......"

కొంచెసేపు నిశ్శబ్దం.

నిశ్శబ్దాన్ని భరించలేకపోయింది నిర్మల.

"అరే! తలుపు వేయడం మర్చిపోయి నట్లున్నాను. వుండు, తలుపువేసి వస్తాను," అని భర్త అనడం విని నిర్మల చటుక్కున బైటకు వెళ్ళి అప్పుడే వస్తున్నట్లుగా తలుపు తీసుకొని లోపలికి రాబోతుండగా భర్త ఎదురువచ్చాడు.

"వచ్చావా నిర్మలా! నీకోసమే ఎదురుచూస్తున్నాను. అరే! ఇవ్వాళ త్వరగా వచ్చేశా." అంటూ "త్వరగావెళ్ళి కాఫీ పట్టుకురా." అన్నాడు భర్త తనగదిలోకి వెళ్తూ. భర్తమాటలు వినేపరిస్థితిలోలేదు నిర్మల. వంటింట్లో మాటలు విన్నతర్వాత నిర్మల తలనొప్పి అధికమైంది. వంటింట్లో కెళ్ళి కాఫీ తీసికొచ్చి భర్తకిచ్చి తనొక ఆస్ప్రో వేసి కొని కాఫీత్రాగి పడుకుంది నిర్మల.

ఆ రాత్రి నిర్మలకు నిద్రపట్టలేదు. భర్త ప్రవర్తనకు ఆశ్చర్యపడసాగింది. పరస్త్రీలతో పరిచయంలేని వ్యక్తి ఈ నాడు తనింట్లో వంటమనిషితో ప్రేమ కలాపాలు సాగిస్తున్నాడు! ఈ పరిస్థి తులలో తనేం చేయాలి? ఇలా ఎందుకు చేస్తున్నావని అడిగితే, 'నా యిష్టం' అని భర్త ఎదురుతిరిగితే అప్పుడు తన గతేం కావాలి? పోనీ అని ఈ పారిజా తాన్ని మానిపిస్తే వంటకు ఇబ్బంది పడాలి. అంతేకాదు, మళ్ళీ ఎవరినైనా కుదుర్చుకుంటే తన భర్త ఆమెతో సరసాలు మొదలెడితే? అసలు ఏ కారణంవలన ఈ పారిజాతాన్ని మాన్పిం చాలి? ఎందుకు మాన్పించావని తుల శమ్మగారు అడిగితే? అలా మాన్పిస్తే తన భర్త మండిపడతాడేమో? ఆలోచ నలతో ఎటూ ఒక నిర్ణయానికి రాలేక చాలసేపు నిద్రాదేవితో పోరాడి, చివరికి లొంగిపోయింది.

తెల్లవారి లేచేసరికి పారిజాతం వాయిలుచీరెతో చక్కగా అలంకరించు





కుని వంటకొచ్చింది. దానిని చూచేసరికి నిర్మలకు ఒళ్లు మండిపోయింది. 'అయినా ఆమెను ఈసడించుకొని ప్రయోజనం ఏమిటి? తన బంగారం మంచిదవ్వాలి కాని' అని అనుకుంది

అంతలో భర్త "సాయంత్రం క్యాంపు కెళ్ళాలి నిర్మలా! వచ్చేసరికి నాలుగు రోజులు పడుతుంది. జాగ్రత్త! ఒక్కదానివి ఎలా వుంటావో ఏమో!" అన్నాడు.

"ఫర్వాలేదు- నాకేంభయం." అంది నిర్మల. భర్త క్యాంపు కెళ్ళిపోయాడు. నాల్గురోజు లయ్యేసరికి భర్త వచ్చాడు. ఉద్యోగానికి రాజీనామా ఇచ్చినట్లు, పారి జాతాన్ని మాన్పించినట్లు నిర్మల చెప్పేట ప్పటికి శంకర్రావుకు అమితాశ్చర్యం వేసింది.

"ఎందుకు మానేశావు? అప్పుడే సరదా తీరిందా?" అన్నాడు.

"నాకు ఒంట్లో ఏం బాగుండటం లేదు." అని చిరునవ్వు నవ్వి, మెల్లిగా భర్త చెవిలో ఏదో చెప్పింది.

"అయితే మనిద్దరమల్లా ముగ్గురం కాబోతున్నామన్నమాట. గుడ్ న్యూస్. మరి నా కింతవరకు చెప్పలేదేం!" అంటూ భార్యను దగ్గరకు తీసుకొని పెదమలపై ముద్దెట్టుకున్నాడు.

